పారదర్శకంగా రీసర్వే పనులు పూర్తి చేయాలి : జేసి

గణపవరం: జిల్లాలో రీ సర్వే పనులు వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సర్వేర్లు సిబ్బందికి రెండో దశ రీ సర్వే పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల మ్యాప్‌లను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో భాగస్వాములైన వారందరినీ కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. మండలంలోని 25 గ్రామాలకు గాను సర్వే ఆఫ్ ఇండియా నుంచి 18 గ్రామాలకు విలేజీ మ్యాప్‌ల వచ్చాయని చెప్పారు. మ్యాప్‌లు వచ్చిన గ్రామాల్లో రీసర్వే వేగవంతం చేయాలన్నారు. రీ సర్వే కార్యక్రమం ప్రారంభం నుండి పూర్తయ్యే వరకూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చేయాలని చెప్పారు. వంద సంవత్సరాల తర్వాత జరుగుతున్న డ్రోన్ రీ సర్వేపై పూర్తి అవగాహన చేసుకుని రెండో దశ రీ సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువ, తహశీల్దార్ పి.లక్ష్మి మండల సర్వేయర్ రాముడు పాల్గొన్నారు.

చించినాడలో మళ్లీ ఉద్రిక్తత

పెరుగులంక భూముల ఉద్యమకారులపై కర్కశత్వం

భూముల పరిశీలనకు వెళ్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం ఎంఎల్‌ఎ నిమ్మలతో సహా 40 మంది అరెస్ట్

బలవంతంగా వ్యాన్‌లోకి ఈడ్చుకెళ్లి వివిధ స్టేషన్లకు తరలింపు

పోలీసుల తీరుతో పలువురికి గాయాలు

ఆస్పత్రికి తరలింపు

ప్రభుత్వంపై దళితల తీవ్ర ఆగ్రహం

ప్రజాశక్తి - యలమంచిలి

చించినాడ మరోసారి రణరగంగా మారింది. అఖిలపక్షాల ఆధ్వర్యంలో దళిత బలహీనవర్గాల సంఘీభావ బహిరంగ సభకు పిలుపునివ్వడంతో గ్రామస్తులతో పాటు వివిధ పార్టీల, ప్రజాసంఘాల నేతలు మంగళవారం భారీగా తరలివచ్చారు. బహిరంగసభ అనంతరం అఖిలపక్షం ఆధ్వర్యంలో పెరుగులంక భూములను పరిశీలించేందుకు బయలుదేరిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడును, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్‌తో సహా సుమారు 40 మందిని పోలీసులు అరెస్టు చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నేతలను తరలిస్తున్న పోలీసుల వాహనాలకు ఉద్యమకారులు అడ్డుగా నిలబడి నిరసన తెలిపారు. అయినప్పటికీ పోలీసులు వారిని బలవంతంగా వారిని పక్కకు నెట్టి ఓ ప్రయివేటు స్కూల్‌బస్సులో స్టేషన్లకు తీసుకెళ్లారు. తొలుత వారిని ఏ స్టేషన్‌కు తరలిస్తున్నారో కూడా తెలియకుండా వ్యాన్‌లో ఎక్కించి తొలుత ఆచంట తీసుకెళ్లారు. ఆచంట కచేరీ సెంటర్‌లో సిపిఎం, టిడిపి నాయకులు వ్యాన్‌ను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. అక్కడకూడా పోలీసులు కర్కశంగ వ్యవహరించి వారికి పక్కకు నెట్టుకుంటూ పెనుమంట్ర మండలం మార్టేరు మీదుగా తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు ఆందోళనకారుల పట్ల విచక్షణారహితంగా వ్యవహరించారు. దాడులకు సైతం పాల్పడుతూ బలవంతంగా ఈడ్చేశారు. ఈ క్రమంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తలకు బలమైన గాయం కావడంతో స్పృహ కోల్పోయారు. వెంటనే ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అరెస్టయినవారిలో నాయకులు కౌరు పెద్దిరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, బాసిన శ్యామల, కానేటి ప్రియాంక, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజుతో సహా సుమారు 40 మందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు.

అరెస్టులను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న టిడిపి, సిపిఎం నాయకులు

అక్రమ కేసులు.. దౌర్జన్యాలు ప్రభుత్వానికి తగవు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం : చించినాడలో మట్టి మాఫియాకు కొమ్ముకాస్తూ, దళితుల భూముల కోసం దౌర్జన్యం చేయడం, కొట్టడం, కేసులు పెట్టడం దారుణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. యలమంచిలి మండలం చించినాడలో అరెస్టు చేసిన ఆయన్ను తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకపక్క సిఎం జగన్.. తమది దళిత ప్రభుత్వమని చెబుతున్నారని, కానీ ఆచరణలో వారిపై దాడులు చేయడం అన్యాయమన్నారు. ఆయన ఎవరి పక్షమో తేల్చాలన్నారు. అధికారులకు కొమ్ముకాస్తూ, దళితులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. మఫియాలకు మద్దతుగా తమరు పనిచేస్తే ప్రభుత్వం కూడా మట్టికొట్టుకుపోతుందన్నారు. కేసులు పెట్టాల్సిన వారిని వదిలేసి వారికి రక్షణగా పోలీసులను, అధికారులను పంపించడం ఎంతవరకు సమంజసమన్నారు. చించినాడ దళితులకు న్యాయం చేయకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ దళితుల మట్టిని అక్రమంగా ఎలా అమ్ముకుంటున్నారో సాక్ష్యాధారాలతో పోలీసు వారికి అప్పజెప్పినప్పటికీ నిందితులపై ఏ విధమైన కేసులూ పెట్టకుండా అమాయకులైన క్లినర్లు, డ్రైవర్లపైన కేసులు పెట్టారు కానీ అసలు కారకులను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. దళితుల రక్షణ కోసం వచ్చిన తమను పదేపదే అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. దళిత భూముల రక్షణ కోసం ఎన్ని కేసులకైనా తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, టిడిపి నాయకులు పరిమి రవికుమార్, గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, పాతూరి రామ్‌ప్రసాద్ చౌదరి, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, టిడిపి నాయకులు పోలీసు స్టేషన్ ఎదుట పెద్దఎత్తున నినాదాలు చేశారు.

వి.శ్రీనివాసరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

బలరాంను అరెస్టు చేస్తున్న పోలీసులు

మనుషులా లేక రాక్షసులా

అంతకుముందు జరిగిన అఖిలపక్ష దళిత బలహీన వర్గాల సంఘీభావలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. మట్టిని తెగనమ్ముకోవడానికి ఎలాంటి దారుణాలకైనా తెగబడుతున్న వైసిపి నాయకులను చూస్తుంటే అసలు వీళ్లు మనుషులా లేక నరరూప రాక్షసులా అనే అనుమానం కలుగుతుందన్నారు. వైసిపి నాయకులు 2024లో తిరిగి అధికారంలోకి వస్తామనే నమ్మకం లేకపోవడంతో అధికారం ఉన్నన్ని రోజులు రాష్ట్రంలోని సహజవనరులన్నింటినీ దోచుకుతినడానికి పోటీ పడుతున్నారని, చించినాడ పెరుగులంక భూముల్లో మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న దళితులపై, పేదలపై పోలీసులు చేత అమానుషంగా దాడి చేయించి తలలు పగలగొట్టి దౌర్జన్యంగా మట్టిని అమ్ముకుంటూ వైసీపీ నాయకులు కోట్ల రూపాయలను దోచుకుంటున్నారని విమర్శించారు. నిబంధనలు ఉల్లంఘించి దళితుల భూముల్లో మట్టిని తరలిస్తున్న ఈ నాయకులకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని, అదేవిధంగా చట్టాలను కాపాడాల్సిన అధికారులు రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారని, వీరందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. సిఎం జగన్‌ను దళితులందరూ నమ్మి ఓట్లు వస్తే ప్రస్తుతం ఆయన దళితులపై కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

ఎంఎల్‌ఎ నిమ్మల మాట్లాడుతూ జగనన్న కాలనీకి మట్టిని తోలుతున్నామని మోసపూరిత మాటలు చెప్పిన నరసాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు, ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్ మట్టిని అమ్ముకుంటూ అడ్డంగా దొరికారని చిన్న చిన్న నేరాలు చేసే నేరస్థులకు పోలీసులు ముసుగు వేసి చూపిస్తారు కానీ నరసాపురం డిఎస్‌పికి దమ్ముంటే మట్టిని అమ్ముకుంటూ అడ్డంగా దొరికిన ముదునూరి ప్రసాదరాజుకు, ఎంఎల్‌సి శ్రీనివాసుకు ముసుగు వేసే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మహాసేన నేత రాజేష్, మాజీ మంత్రి కొండ్రు మురళీ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు ఫార్వర్డ్ బ్లాక్ సభ్యులు లంక కృష్ణమూర్తి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు దేవ రాజేంద్రప్రసాద్ జనసేన నాయకులు భారం చినబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, నాయకులు పాల్గొన్నారు,

సంఘీభావ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

సమస్యలు పరిష్కరించాలని స్కీం వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - వీరవాసరం

కార్మికుల, స్కీం వర్కర్ల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రైస్‌మిల్లు కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల, విఒఎలు, పంచాయతీ కార్మికులు, విఆర్‌ఎలు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌యీ ధర్నాలో పాల్గొన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, రాజకీయ వేదింపులు ఆరికట్టాలని, ఇప్పటికే సాధించుకున్న జిఒల ప్రకారం సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ రైస్ మిల్లు కార్మికులకు సంవత్సరంలో కొన్ని రోజులు మాత్రమే పని ఉంటుందన్నారు. వీరికి ఇఎస్‌ఐ, పిఎఫ్, వెల్ఫేర్ ఫండ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అశ వర్కర్లకు, అంగన్‌వాడీలకు పని భారం తగ్గించాలని కోరారు. కాలపరిమితి జిఒలు తీసుకొచ్చి విఒఎలను తొలగించే ప్రయత్నం మానుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించి పిల్లలకు నష్టం కలిగించే కాంట్రాక్టు విధానాన్ని మానుకోవాలన్నారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరికి సబ్బులు, నూనెలు, చెప్పులు, యానిఫారాలు, ఐడెంటిటీ కార్డులు, సమకూర్చాలన్నారు. బ్రిటీష్ కాలం నుండి గ్రామాలను అంటిపెట్టుకుని రోజువారి వ్యవసాయ సంబంధాలను ప్రభుత్వానికి అనుసంధానం చేస్తూ కీలకపాత్ర పోషిస్తున్న విఆర్‌ఎలను ప్రభుత్వం గుర్తించడంలేదన్నారు. తక్షణం ప్రభుత్వం కలగజేసుకుని వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ సుబ్బారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.వరలక్ష్మి, పి.నాగరత్నం, కొత్తల సత్తిబాబు, లక్ష్మీ, నిర్మల, ప్రదీప్, మల్లుల ఏసుబాబు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దారుణం

ప్రజాశక్తి - ఉండి

శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును, జిల్లా కార్యదర్శి బి.బలరాంను, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడును అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని సిపిఎం ఉండి మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా సిపిఎం నాయకులు ఉండి మెయిన్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దళితుల భూముల్లో నుంచి గత కొన్ని రోజులుగా అక్రమ మైనింగ్‌కు ప్రభుత్వ పెద్దలు పాల్పడి కోట్ల రూపాయల సొమ్మును అక్రమంగా ఆర్జిస్తుండగా దానికి నిరసనగా చించినాడ సిపిఎం నేతలు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే వారికి సంఘీభావం తెలిపిన నేతలను అక్రమంగా అరెస్టు చేసి ఉగ్రవాదుల కంటే దారుణంగా ఈడ్చుకువెళ్లడం చూస్తుంటే ఇది ప్రజాప్రభుత్వమేనా అని అనిపిస్తుందన్నారు. దళిత ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే సిఎం జగన్ ఇలాంటి దుర్మార్గ చర్యలకు పాల్పడుతుండటం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తెలియజేస్తుందన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని సిపిఎం తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొట్టాడ వెంకటేశ్వరరావు, నాయకులు కడలి నాగేశ్వరరావు, మజ్జి నాగేశ్వరరావు, జుత్తిగ లకుడు, కట్టా రవి, వంజరపు సూర్యనారాయణ, కంది గణపతి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : చించినాడలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడును, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నరసాపురం అంబేద్కర్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు పొన్నాడ రాము, పొగాకు నారాయణరావు, బూడిద జోగేశ్వరరావు, రామలింగం, తెలగంశెట్టి సత్యనారాయణ, పొన్నాడ మల్లేష్, అందే శ్రీను, బోడశింగు అప్పారావు, వంకల రాములు పాల్గొన్నారు.

2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు ఒపిఎస్ అమలు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాల్సి ఉండగా ప్రభుత్వం గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) ప్రతిపాదించి అందరినీ నిరాశకు గురి చేసిందని, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపి మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. సిపిఎస్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2004 జనవరి నుండి అమలు కాగా రాష్ట్ర ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 2004 సెప్టెంబర్ నుండి అమలు జరిగిందన్నారు. నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేస్తూ కేంద్ర ప్రభుత్వం మెమో 57 జారీ చేసిందని పేర్కొన్నారు. సిపిఎస్ అమలు కావడానికి ముందు నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగులందరికీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. సెప్టెంబర్ 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తి చేసుకున్నవారు 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులు సుమారు 6500 మంది, 1998 డిఎస్‌సి హిందీ పండితులు 200 మంది, పోలీసులు 3300 మంది మొత్తం 10,800 మంది ఉన్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం వీరందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాల్సి ఉందని తెలిపారు. ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల్లో వీరందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని, పలు సందర్భాల్లో అధికారులు నమ్మబలికారని గుర్తుచేశారు.

ప్రజలపై విద్యుత్ ఛార్జీల మోత

వినియోగపు, కస్టమర్, ట్రూ అప్, ఇంధనపు ఛార్జీల పేరుతో బాదుడు

అదనపు ఛార్జీల కింద ప్రతి బిల్లుపై రూ.230పైనే

లబోదిబోమంటున్న వినియోగదారులు

లో ఓల్టేజీ, విద్యుత్ కోతలతో జనం నరకయాతన

ప్రభుత్వ తీరుపై ప్రజలు ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరుకు చెందిన వరలక్ష్మి కుటుంబం అద్దె ఇంటిలో ఉంటుంది. సాధారణంగా వేసవిలో కరెంటు బిల్లు ఎక్కువ రావడం సహజం. కానీ వాడిన విద్యుత్ కాకుండా బిల్లులో డిమాండ్‌ఛార్జి, కస్టమర్ ఛార్జి, ఇడి, ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ రూపంలో అదనపు ఛార్జీల కింద రూ.252 వేయడంతో ఆమె 'షాక్'కు గురయ్యారు. ఎవరికి చెప్పాలో, ఏంచేయాలో తెలీక లబోదిబోమంటుంది. ఈ విధంగా విద్యుత్ బిల్లులు వస్తే తాము ఎలా కట్టాలంటూ ఆ కుటుంబం గగ్గోలు పెడుతోంది.

జువ్వలపాలేనికి చెందిన శ్రీనివాస్‌కు ఏప్రిల్ నెలలో విద్యుత్ బిల్లు రూ.784 వచ్చింది. మే నెల బిల్లు రూ.మూడు వేలకు పైగా వచ్చింది. ఇందులో అదనపు ఛార్జీల పేరిట రూ.233 వరకూ వడ్డించారు. విద్యుత్ ఛార్జీల పెరుగుదల, అదనపు ఛార్జీల వడ్డనతో తనకు ఇంత పెద్దమొత్తంలో బిల్లు వచ్చిందంటూ ఆ కుటుంబం లబోదిబోమంటుంది.

పైన పేర్కొన్న వరలక్ష్మి, శ్రీనివాస్ కుటుంబాలే కాదు.. జిల్లాలో ఏ ఒక్క కుటుంబాన్ని కదిపినా విద్యుత్ బిల్లులపై లబోదిబోమంటున్న పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ ఈ విధంగా బిల్లులు రాలేదని, బిల్లులు ఎలా చెల్లించాలో అర్థంకావడం లేదంటూ అంతా ఘొల్లుమంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పది లక్షలకుపైగా గృహవినియోగ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో మూడొంతల కనెక్షన్లు పేద, మధ్య తరగతి ప్రజానీకానివే. వైసిపి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ ఛార్జీల పెంపుతో పాటు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో అదనపు భారం మోపుతోంది. మే నెల విద్యుత్ బిల్లులు చూసి వినియోగదారులు 'షాక్' అవుతున్నారు. ప్రతి విద్యుత్ బిల్లుపైన అదనపు ఛార్జీ కింద రూ.230 నుంచి రూ.250 వరకూ ఉన్నాయి. ఇందులో విద్యుత్ వినియోగపు ఛార్జీలు, కస్టమర్ ఛార్జి, విద్యుత్ సుంకం, ఇందన ఛార్జీల పేరుతో భారాలు మోపారు. వేసవికాలంలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండటం సర్వసాధారణం. ఈ ఏడాది ఎండలకు జనాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఫ్యాన్ ఆగితే ఉండలేని పరిస్థితి నెలకొంది. సాధారణ రోజుల కంటే బిల్లులు కొంచెం ఎక్కువగా వస్తాయని వినియోదారులు భావించారు. అదనపు ఛార్జీలతో విద్యుత్ బిల్లులు మోతమోగించారు. దీంతో గ్రామాల్లోగానీ, పట్టణాల్లోగానీ ఏ ఇద్దరు కలిసిన విద్యుత్ బిల్లుల గురించే మాట్లాడుకుంటున్నారు. బిల్లులు కట్టలేక సామాన్య ప్రజానీకం విలవిలాడుతోంది. ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో హడావుడి చేస్తూ ప్రజలపై భారాలు మోపుతుందన్న చర్చ జనాల్లో నడుస్తోంది.

విద్యుత్ కోతలు.. లో ఓల్టేజీ సమస్య

విద్యుత్ ఛార్జీల పెంపు, అదనపు ఛార్జీల పేరుతో వినియోగదారులపై విరుచుకుపడిన విద్యుత్ శాఖ ప్రజలకు నాణ్యమైన కరెంటు సరఫరా చేయడం లేదు. లో ఓల్టేజీ పేరుతో జిల్లా ప్రజానీకం ప్రతిరోజు నరకం అనుభవిస్తున్నారు. దీనికి తోడు కరెంటు కోతలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి ప్రజలు ఉన్న ప్రాంతంలో లో ఓల్టేజీ సమస్య మరింత దారుణంగా తయారైంది. దీంతో ఫ్యాన్లు తిరగక, లైట్లు వెలగక జనం పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతంగామారాయి. కరెంటు ఉన్నా లేనట్టే అన్నట్లు పరిస్థితి తయారైంది. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన కరెంటు సరఫరా చేయాల్సిన విద్యుత్‌శాఖ పెద్దగా పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యమైన కరెంటు సరఫరా చేయకపోగా, విద్యుత్ బిల్లుల పేరిట భారాలు మోపడంపై జనం మండిపడుతున్నారు.

విఆర్‌ఎలకు 'మే' జీతం ఇవ్వాలని

ట్రెజరీ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - పాలకొల్లు

విఆర్‌ఎలకు మే నెల జీతం ఇవ్వాలని విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గణేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పాలకొల్లు సబ్‌ట్రెజరీ వద్ద విఆర్‌ఎలు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. 13 జిల్లాల్లో ఎక్కడా లేనిది ఒక భీమవరం జిల్లాలోని పలు చోట్ల ట్రెజరీ వారు జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. తహశీల్దార్లందరూ జీతాలు ఇవ్వమని ట్రెజరీకి బిల్లు పంపిస్తే వాటిని బిల్లు చేయకుండా ట్రెజరీ వారు ఆపారని, హైకోర్టులో డిఎ కేసు ఉందని చెప్పి కోర్టును కూడా లెక్కచేయకుండా ట్రెజరీ వారు ఆపడం సరికాదని చెప్పారు. విఆర్‌ఎల జీతాలు రాకపోతే భీమవరం కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఎలు

పోలింగ్ కేంద్రాలు పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం

గునుపూడి ఇందిరా గాంధీ ప్రత్యేక ప్రాథమిక పాఠశాల, నరసయ్య అగ్రహారం బందా వీర్రాజు పాఠశాల పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తలుపులు, రహదారి, మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఓటరు జాబితాలను పరిశీలించారు. వివాదాలకు తావు లేకుండా జాబితాలు ఉండాలని బిఎల్‌ఒలను జిల్లా కలెక్టరు ఆదేశించారు. కలెక్టరు వెంట తహశీల్దార్ వై.రవికుమార్, పురపాలక సంఘం కమిషనర్ ఎస్.శివరామ కృష్ణ, బిఎల్‌ఒ పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న వడ్డిగూడెం గ్రామస్తులు

వడ్డిగూడెం రహదారిని అభివృద్ధి చేయాలని నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం నుండి వడ్డిగూడెం వెళ్లే రహదారికి మరమ్మతులు చేయాలంటూ వడ్డిగూడెం గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంఎల్‌ఎ అంజిబాబు ఈ రహదారికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి అభివృద్ధి చేశారన్నారు. మా గ్రామ రహదారి పేరుతో నిధులు కేటాయించినప్పటికీ వీరవాసరం గ్రామం హద్దు వరకూ సిసి రోడ్డు వేసి మా గ్రామం లో మాత్రం బిటి రోడ్డు వేశారని తెలిపారు. ప్రస్తుతం ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి రోజూ గ్రామం నుంచి రాత్రి వేల ఇతర ప్రాంతాలకు కూలీ పనులు, చెరువు పనులకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈ మార్గంలో విద్యుత్ లైట్లు లేక ప్రమాదాలకు గురవుతున్నామన్నారు. ఈ మార్గం గుండానే ప్రస్తుతం జగనన్న లేఅవుట్ల లబ్ధిదారులు నిత్యం రాకపోకలు చేయడంతో రద్దీగా మారిందన్నారు. దీంతో ఈ రహదారి ప్రాదదాన్యతను గుర్తించి రహదారిని పటిష్టపర్చాలని కోరుతున్నారు.

డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెనుగొండ

వర్షాలు వచ్చేనాటికి సకాలంలో డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలని ఆచంట ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు తెలిపారు. సిద్ధాంతంలో జరుగుతున్న డ్రెయినేజీ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు వస్తే పనులు చేయడానికి వీలుండదని, పలు ఏరియాల్లో మురుగు నిలిచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిలోనే సక్రమంగా పనులు జరుగుతాయని తెలిపారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మలేరియాపై అవగహన ర్యాలీ

ప్రజాశక్తి - గణపవరం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్లు పి.సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి తెలిపారు. మలేరియా వ్యతిరేక మహోత్సవాల సందర్భంగా మంగళవారం గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో కొత్తపల్లిలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దోమల వల్ల డెంగీ, మలేరియా వంటి రోగాలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇంటి పరిసరాల్లో పనికిరాని టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి చిప్పల్లో మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి వద్ద ఉన్న పూలకుండీల్లో ప్రతి వారమూ నీరు మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు, సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, హెల్త్ అసిస్టెంట్లు ఎ.కృష్ణ, జి.శ్రీనివాస్, ఎం.నల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం

క్యాంపస్ ఇంటర్వ్యూలకు 9 మంది ఎంపిక

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో ఈ నెల 7వ తేదీన జరిగిన విప్రో ఆన్ క్యాంపస్ డ్రైవ్‌లో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న 9 మంది కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరికి వార్షికాదాయం రూ.2 లక్షలని, హైదరాబాద్‌లో వీరికి ట్రెయినింగ్ ఇస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ లెఫ్టనెంట్ యు లక్ష్మీసుందరీబాయ్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మురళీకృష్ణంరాజు

ముగిసిన స్కేటింగ్ శిక్షణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నెల రోజుల పాటు రోలర్ స్కేటింగ్ వేసవి శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన క్రీడాకారులకు మంగళవారం వివిధ ఏజ్ గ్రూపుల మధ్య పోటీలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండి ప్రతి ఒక్కరిలోనూ క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఎటువంటి రుసుము లేకుండా కళాశాల సహకారంతో విశాఖపట్నంలోని లాస్ట్ లీయో స్కేటింగ్ అకాడమీ కోచ్ జె చిరంజీవ రాజు పర్యవేక్షణలో శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ సిహెచ్ హరిమోహన్, జి.సారిక, అవినాష్, వాలీబాల్ కోచ్ రామరాజు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌లో ప్రజలు భాగస్వాములు కావాలి

డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు తెలిపారు. మండలంలోని భీమలాపురం పంచాయతీ కార్యాలయం వద్ద హెల్త్ సెంటర్లో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో వడగాల్పులు వీస్తున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి వాటిని తాగించేందుకు ప్రోత్సహించాలని కోరారు. ఏమైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కె.హైందవి, ఎంపిహెచ్ఎస్ ఎం.మోహన్, ఎంపిహెచ్ఎ ఎం.వెంకటేశ్వర్లు, ఎఎన్ఎం సుష్మ, డిఇఒ రమాదేవి పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కాళ్లకూరులో పసర్లెక్కిన మంచినీటి చెరువు

కాళ్లకూరులో పసర్లెక్కిన మంచినీటి చెరువు

పల్లె గొంతెండుతోంది..!

శివారు ప్రాంతాలకు అందని తాగునీరు
శుద్ధి చేయని నీటితో ప్రజల అవస్థలు
చెరువుల్లో తగ్గిన నీటిమట్టాలు

ప్రజాశక్తి - కాళ్ల

పంచాయతీలు లక్షలాది రూపాయలు వెచ్చించినా ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదు. గ్రామాల్లో చెరువులు అడుగంటడం.. నీటి రంగు మారడంతో ప్రజలకు రక్షిత నీరు అందని ద్రాక్షగా మిగిలింది. డెల్టాలో పంట కాలువల శివారున ఉండి, ఆకివీడు, కాళ్ల, భీమవరం, మొగల్తూరు, నరసాపురం తదితర మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. వెంకయ్య వయ్యేరు, పాత వయ్యేరు, ఉండి ప్రధాన కాలువ, జిఅండ్‌వి కాలువల్లోని నీటితోనే ఆయా గ్రామాల్లో చెరువులను నింపుకోవాలి. మరోవైపు ఆక్వా విస్తీర్ణంతో కాలుష్య సమస్య తీవ్ర రూపం దాల్చింది. చుట్టూ నీరున్నా దప్పిక తీర్చుకోలేని పరిస్థితి. ప్రధానంగా పంట కాలువలకు నీటి సరఫరా నిలిపివేసే సమయంలో ఆక్వా కాలుష్యానికి గురైన ప్రాంతాల్లో చెరువులోని నీరు రకరకాల రంగుల్లోకి మారిపోతోంది.

ప్రస్తుతం నమోదవుతున్న భారీ ఉష్ణోగ్రతలతో చెరువుల్లో నీరు ఆవిరవుతోంది. నీటిమట్టం పడిపోతోంది. నీటి నిల్వలు మరింత తగ్గితే మట్టి వాసన వచ్చే ప్రమాదం ఉందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 60 శాతంపైగానే నీటి నిల్వలు తగ్గినట్లు అంచనా వేస్తున్నారు. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే ఆయా చోట్ల ఏ విధంగా ముందుకెళ్లాలనే దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

పసర్లెక్కిన నీరు..

మంచినీటి చెరువుల్లో నీరు పసర్లుగా మారుతున్నాయి. ఫిల్టర్ చేయని నీటిని కుళాయిల ద్వారా అందించడంతో తాగలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నీటి రంగు మారకుండా ఉండాలంటే చెరువుల్లో బ్లీచింగ్ బస్తాలు కట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామ కార్యదర్శులను ఆదేశించారు.

ఒక్క పూటే నీరు..

మేజర్ గ్రామాలతోపాటు చిన్న గ్రామాల్లో కూడా కుళాయిల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. అయితే వచ్చిన నీరు కూడా స్వచ్ఛమైన నీరు అందించకపోవడం, పలు గ్రామాల్లో శివారు ప్రాంతాలకు నీరు సక్రమంగా వదలకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అత్యధిక గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దప్పిక తీర్చుకునేందుకు అత్యధిక శాతం మంది మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు. నీటి కోసం చాలా ఖర్చు పెడుతున్నామని, అధికారులు స్పందించి శుద్ధి చేసిన జలాలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు రంగు మారకుండా చర్యలు తీసుకుంటున్నాం..

తానింకి శ్రీనివాసరావు, ఆర్ డబ్ల్యుఎస్ ఎఇ, కాళ్ల

ఎండ తీవ్రత వల్ల మంచినీటి చెరువుల్లో నీటి ఆవిరి శాతం పెరిగే అవకాశాలు ఉన్నాయి. సాధ్యమైనంత వరకూ తాగునీటిని పొదుపుగా వాడాలి. కుళాయిల ద్వారా శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని గ్రామ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. చెరువుల్లో నీరు రంగు మారకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

జగనన్న విద్యా కానుక అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

వీరవాసరంలో విద్యాకానుక అందజేత

విద్యార్థులు జగన్ ఇచ్చే మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పొలమూరు సర్పంచి కాకర రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక హైస్కూల్లో హెచ్ఎం బిడి సరస్వతి ఆధ్యర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి రాజేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకతో పాటు, పాఠశాలలో మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ప్రసాద్, ఉపసర్పంచి కలిదిండి దినేష్ రాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరవాసరం : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సౌకర్యాలను ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకుని, ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని పలువురు ప్రజా ప్రతినిధులు ఆకాంక్షించారు. జెవికె కిట్లు అందజేత కార్యక్రమాన్ని రాయకుదురు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ గుబ్బల సత్యనారాయణ, సర్పంచి గెడ్డం భారతీ భాస్కరరావు, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, తదితరులు విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోడూరు : జిన్నూరు జెడ్‌పి హైస్కూల్లో మంగళవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి శబ్బితి సుమంగళిసాగర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జెడ్‌పిటిసి పెద్దిరాజు మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా సిఎం జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. నాడు- నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దారన్నారు. ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్ మాట్లాడారు. విద్యార్థులంతా ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి, సొసైటీ ఛైర్మన్ డిటిడిసి బాబు, ఎఎంసి డైరెక్టర్ జమ్ము మృత్యుంజయ రావు, ఎంఇఒ ఐ.జనార్ధనరాజు, హైస్కూల్ హెచ్ఎం శివజ్యోతి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు, షూలు పంపిణీ చేశారు.

మొగల్తూరు : విద్యతోనే మంచి భవిష్యత్ ఏర్పడుతుందని జెడ్‌పిటిసి సభ్యుడు తిరుమాని బాపూజీ విద్యార్థులకు సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం స్థానిక పెన్మత్స రంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతిస్తున్నారని, నాడు - నేడులో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు బ్యాగ్, షూస్, సాక్స్‌లు, బెల్ట్ అందిస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పడవల మేరీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవి శంకర్‌సర్కార్, స్కూల్ కమిటీ ఛైర్మన్ బర్రి వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

పోడూరులో..

వారాహి యాత్రను విజయవంతం చేయాలి

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు

ప్రజాశక్తి - కాళ్ల

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఈ నెల 14న చేపట్టనున్న వారాహి యాత్రను విజయవంతం చేయాలని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు పిలుపు నిచ్చారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవాలయాల్లో ఒకటైన కాళ్లకూరు వెంకటేశ్వర స్వామి వారిని మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉండి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించామన్నారు. జనసేన వారాహి యాత్ర దిగ్విజయంగా కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీర మహిళ గవర లక్ష్మి, రాష్ట్ర ప్రోగ్రామ్స్ కమిటీ మెంబెర్ తోట వాసు, మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజయనేయులు, ఉపాధ్యక్షులు ఓగిరాల రాజేష్, గడి రాము, ప్రధాన కార్యదార్శులు ఇర్రింకి జగన్ పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఈ నెల14వ తేదీ నుంచి జరిగే జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే వారాహి యాత్రను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ పిలుపునిచ్చారు. మంగళవారం చేగొండి సూర్యప్రకాష్ అధ్యక్షతన నెగ్గిపూడి గ్రామం, (వనంపల్లి)లో భక్త ఆంజనేయ స్వామివారి ఆలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, నెలమూరు గ్రామ అధ్యక్షులు నాగరాజు అప్పల నరసింహారాజు పాల్గొన్నారు.

టీచర్లను నియమించాలని నిరసన

తాడేపల్లిగూడెం: మా గ్రామంలో పిల్లలు చదువుకునేందుకు పాఠశాల ఉన్నా చదువు చెప్పేందుకు సరైన టీచర్లు లేక పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నీలాద్రిపురం శివారు కృష్ణాపురం ఎంపిపి పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ వరపు లక్ష్మి మాట్లాడుతూ తమ గ్రామంలో అంతా నిరుపేద విద్యార్థులేనని వారు చదువుకునేందుకు ఎంపిపి పాఠశాల ఒక్కటే అని తెలిపారు. అయితే తమ పాఠశాలలో ఉపాధ్యాయిని మానసిక స్థితి బాగోక విద్యార్థులు చదువులేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అయితే ఆ లోటు భర్తీ చేసేందుకు ఓ యువతితో చదువు చెప్పించే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, నాయకులు స్పందించి తమ పాఠశాల విద్యార్థ భవిష్యత్ కోసం ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెదముర్తి సంతోషి. పి రోషి. గాయత్రి పులుసు శ్రీనివాస్ కట్టుబోయిన వెంకమ్మ పాల్గొన్నారు.

పెనుమంట్రలో జన్ భాగీదారి

ప్రజాశక్తి - పెనుమంట్ర

జన్ భాగీదారి కార్యక్రమం ద్వారా పిల్లల ప్రాథమిక స్థాయిలోనే గాక, ఉన్నత స్థాయిలో కూడా విద్యా ప్రమాణాలను అందుకునేందుకు తోడ్పడుతుందని మార్టేరు సెక్టార్ సూపర్ వైజర్ రాయుడు నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం నెగ్గిపూడి ఎంపిపి స్కూల్ (ఆర్) కాంప్లెక్స్ కాంఫౌండ్‌లోని కోడ్ నెంబర్-2 టిఎల్‌డి భవాని, 125 సూపర్‌వైజర్ రాయుడు నాగలక్ష్మి సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ మేరీ ఎలిజిబెత్ నేతృత్వంలో జన్ భాగీదారి కార్యక్రమం స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులతో కలిసి నిర్వహించారు. పిల్లల జీవితంలో మొదటి ఆరు సంవత్సరాలు అత్యంత విలువైనవన్నారు. మూడేళ్ల వరకూ తల్లి ఒడికి, ఇంటికి పరిమితమైన పిల్లలు తర్వాత బయట ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నాన్ని మొదలుపెడతారన్నారు. కార్యక్రమంలో సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి, ఎంపిటిసి పెనుగొండ లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ సాయిరెడ్డి, వెలగలేరు సొసైటీ ఛైర్మన్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

రుణాలు వాడుకుని సమాధానం చెప్పడం లేదు

ఎపిఎం సుభాషిణి ఆరోపణ

ప్రజాశక్తి - మొగల్తూరు

స్త్రీనిధి రుణాలను వసూలు చేసుకుని బ్యాంకులకు చెల్లించకుండా తన సొంతానికి రూ.14.62,176 వాడుకున్న విఒఎ ఎటువంటి సమాధానమూ చెప్పడం లేదని వైఎస్ఆర్ కాంతి పథం ఎపిఎం ఎం.సుభాషిణి ఆరోపించారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేరుపాలెం సౌత్ లోని బెల్లంకొండవారి మెరకకు చెందిన మద్దాల సూర్యకుమారి విఒఎగా భాద్యతలు నిర్వహిస్తున్నారు. ఆ గ్రామంలోని సుమారు 38 సంఘాలకు రూ.60 లక్షలు స్త్రీ నిధి రుణం అందించామన్నారు. సభ్యుల నుండి ప్రతి నెలా వసూలు చేసిన స్త్రీనిధి రుణాలు, వాటా ధనాలు, సభ్యత్వ రుసుము, సిఐఎఫ్ రుణాలకు సంబంధించి బ్యాంకులో స్త్రీనిధి ఖాతాకు జమచేసి ఆ రసీదును తమకు పంపాలన్నారు. అయితే ఆ గ్రామం నుండి రికవరీ సరిగ్గా రావడంలేదని గుర్తించి గత ఏడాది డిసెంబర్లో సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయగా సభ్యులంతా ప్రతి నెలా తాము తీసుకున్న రుణాలను విఒఎకు అందించామని తెలిపారు. ఈ విషయంపై ఆమెను ప్రశ్నించగా తాను సొంతానికి వాడుకున్నానని, తనకు కొంత సమయం ఇస్తే వాయిదాల రూపంలో జమచేస్తానని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారన్నారు. నెలలు గడిచినా వాయిదాలు చెల్లించకపోవడం అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. ఇదే విషయంపై ప్రభుత్వ దుర్వినియోగం చేసిన ఆమెపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో సిసి సుదర్శన్ పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడుతున్నారని విఒఎ ఫిర్యాదు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగలూరు వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం ఎం.సుభాషిణి, వైసిపి నాయకుడు తన పట్ల వేధింపులకు పాల్పడుతున్నారని పేరుపాలెం సౌత్ బికె.మెరక వెలుగు గ్రామ సంఘానికి చెందిన విఒఎ మద్దాల సూర్యకుమారి ఆరోపించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు తెలిపారు. తాను పదమూడేళ్లగా విఒఎగా పనిచేస్తున్నానని తెలిపారు. మా గ్రామసంఘానికి 2019 నుంచి 23 వరకూ స్త్రీనిధి బ్యాంకు నుంచి రూ.60 లక్షల రుణం ఇచ్చారని, ఆ నిధులను సభ్యులకు ఇచ్చి తిరిగి వసూలు చేసి స్త్రీనిధి బ్యాంకుకు చెల్లించానని తెలిపారు. అధికారులు విచారణ చేశారని, ఆ సమయంలో రూ.4.50 లక్షలు చెల్లించాలన్నారని, తాను నిధులు మొత్తం చెల్లించానని తెలిపారు. గతేడాది డిసెంబరులో అధికారులు మరోపర్యాయం వచ్చి మా గ్రామ సంఘ దస్త్రాలు పరిశీలించి రూ.14 లక్షలు చెల్లించాలని తన చేత బలవంతంగా అంగీకార పత్రం రాయించుకున్నారని తెలిపారు. విఒఎ ఉద్యోగం మాత్రమే ఆధారమని, దాన్ని నిలుపుకోవడానికి నా బంగారు ఆభరణం, ద్విచక్రవాహనం విక్రయించి రూ.3 లక్షలు చెల్లించానని తెలిపింది. నెల రోజుల కిందట స్త్రీనిధి బ్యాంకు ఎజిఎం ఇక్కడకు వచ్చి దస్త్రాలు పరిశీలించి తాను చెల్లించాల్సిన బకాయి లేదని తేల్చారని, 2018కు బకాయిలకు వడ్డీ రూ.9లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మతి చెందిన సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరు పంచాయతీ పరిధి సత్రవుపాలెంకు చెందిన దొంగ సత్యనారాయణ (65) మంగళవారం వేకువజామున ఇదే పంచాయతీ పడమటిపాలెంలోని పొలానికి దిచక్ర వాహనంపై వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా స్థానిక పెట్రోల్ బంకు సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తూ పడడంతో తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని భీమవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 11 గంటల సమయంలో సత్యనారాయణ మృతి చెందాడు. మృతుని కుమారుడు రాంబాబు ఇచ్చిన పిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని కోడేరు వశిష్ఠ గోదావరిలో దిగి ఇరగవరం మండలం పొదలాడ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేదని వృద్ధురాలు పెచ్చెట్టి భూదేవి (70) మృతి చెందింది. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం సాయంత్రం ఆలమూరులో తాడేపల్లిగూడెం నుంచి కోడేరు వెళ్లే బస్సు ఎక్కింది. ఆమె మార్టేరులో దిగాల్సి ఉండగా కోడేరులో బస్సు దిగి గోదావరి ఒడ్డుకు చేరుకుంది. అనంతరం సాయంత్రం వరకూ అక్కడే ఉంది. తరువాత గోదావరిలో దిగి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజకుమార్ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని మృతదేహం అని వాట్సప్ గ్రూపుల్లో హల్ చల్ చేయడంతో సమాచారం తెలుసుకున్న బంధువులు మంగళవారం సాయంత్రానికి ఆచంట చేరుకున్నారు. అనంతరం ఎస్ఐ సమాచారం తెలుసుకుని బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వివాహిత హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జిల్లా ఎస్‌పి యు.రవి ప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం

వివాహిత హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధించినట్లు జిల్లా ఎస్‌పి యు.రవి ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుటుంబ కలహాల కరణంగా భర్తతో వేరుగా ఉంటున్న కోనాల మౌనిక స్థానికంగా ఉండే తుంపల ఆదినారాయణతో సహజీవనం చేసి గర్భం దాల్చింది. ఈ క్రమంలో జనవరి 2021లో మౌనిక తనను పెళ్లి చేసుకోవాలని ఆదినారాయణని ఒత్తిడి చేసింది. దీంతో పథకం ప్రకారం మౌనికను వాండ్రంలో గమిని ఐస్ ఫ్యాక్టరీ వద్దకు తీసుకెళ్లి ఆదినారాయణ కత్తితో పొడిచి హత్య చేశాడు. మృతురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. దీనిలో భాగంగా భీమవరం ఎడిజె కోర్టులో విచారణ అనంతరం నిందితుడు తుంపల ఆదినారాయణకు జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధించడం జరిగిందని ఎస్‌పి తెలిపారు.

CHANGE OF NAME

I, SANGANI VAGARAJU, S/O. SANGANI NARASIMHA SWAMY, D.NO. 3-43, NEAR TUFFAN CENTER, LB CHERLA POST, NARASAPURAM (M), W.G.DT. A.P. I HAVE CHANGED MY NAME FROM SANGANI GOKARAJU (OLD NAME) TO SANGANI VAGARAJU (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRESPONDENCE WILL BE COUNTINUE WITH MY NEW NAME SANGANI VAGARAJU

In the Court of the Senior Civil Judge, Tadepalligudem
E.P. No. 6/2023 in O.S. No. 244/2011

Between:
Madicherla Krishnamurthy ...D.H.R
AND
1. Palakolanu Lakshmi
2. Palakolanu Siva Kumar
3. Palakolanu Venkata Lakshmi Prasanna
4. Ponnapalli Pushapavathi
5. Ponnapalli Murali Krishna
6. Ponnapalli Rajeev ...J.D.Rs

Please take notice that in the above matter for recovery of the Decree amount the Honourable Court ordered for sale of E,.P schedule Property in the open auction in the premises of the Senior Civil Judge Court, Tadepalligudem and fixed the date for auction of the E.P. schedule property on 30-06-2023. If, any one willing to participate in the open auction to be held on 30-06-2023 is to be attend before the Senior Civil Judge Court, Tadepalligudem **at 10.30 A.M on 30-06-2023** and participate in the auction after knowing the terms and conditions of the auction.

E.P SCHEDULE

West Godavari District, Nallajerla Mandal, Ananthapalli SRO, Prakasaraopalem Village and Gram Panchayath, Door No. 6-129/A, Current Service No. 623, Rice Mill in an extent of 872 square yards or Ac. 0-18 cents on the middle out of Ac. 0-50 cents on the East out of Ac. 1-55 cents in R.S. No. 225/5 and bounded as follows.
EAST: Road.
SOUTH: Land of Boyapati Gangaraju.
WEST: Land of Rajakas Society.
NORTH: Land of P.Viswanadham.

Within the above boundaries Rice Mill in an extent of Ac. 0-18 cents or 872 square yards of site *together with roof, doors, electrical fittings, rice mill machinery, rubber, Polaru separator, Konlu, elecates, 20 HP motor, Jallellu, 3 stoves etc., and all other machinery.*

D.H.R. Value: Rs. 10,00,000/-
Amin Value: Rs. 32,00,000/-

K.MANI KUMAR
Advocate for D.H.R
Ph: 08818-244620
Tadepalligudem
Date: 13-06-2023